## ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలి

ములుగురూరల్, మే16 : కార్పొరేట్ కళాశాలలో ఇంటర్మీడియట్ ప్రవేశాలకు అర్హులైన ఎస్సీ, ఎస్టీ, బీసీ, ఈబీసీ, మైనార్టీ, దివ్యాంగ విద్యార్థులు ఈ నెల 31లోగా దరఖాస్తు చేసుకోవాలని షెడ్యూల్ కులాల అభివృద్ధి అధికారి లక్ష్మణ్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పూర్తి వివరాలకు ములుగులోని తన కార్యాలయాన్ని సంప్రదించాలని సూచించారు.

## హనుమాన్‌గుడికి మైక్‌సెట్ బహూకరణ

వెంకటాపూర్, మే 16 : మండలంలోని పాపయ్యపల్లి అంజనేయస్వామి ఆలయానికి గ్రామానికి చెందిన స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ధరంసోత్ రాంసింగ్ మైక్‌సెట్‌ను బహుకరించారు. భక్తుల కోరిక మేరకు మైక్‌సెట్ అందించినట్లు చెప్పారు. ముమ్ముందు ఆలయ అభివృద్ధికి సహకరించాలని గ్రామస్తులు కోరారు.

## దళితులకు అందని అంబేద్కర్ అభయహస్తం

టేకుమట్ల, మే 16 : అంబేద్కర్ అభయ హస్తం పథకం దళితులకు అందని ద్రాక్ష లాగా మారిందని టీఎస్ ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు ఎలుకటి రాజయ్య మాదిగ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ అభయహస్తం ద్వారా రూ.12 లక్షల ఆర్థిక సాయం అందిస్తామని కాంగ్రెస్ నేతలు ఓట్లు దండుకున్నారని, ప్రభుత్వం ఏర్పడి 17 నెలలైనా పథకం ప్రారంభించడం లేదని మండిపడ్డారు. దళితులను మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వానికి రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బుద్ధి చెప్తారన్నారు.

## అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు ఎస్టిమేషన్

మంగపేట, మే 16 : మండలంలోని కమలాపురం, మల్లూరు, రాజుపేట, దోమెడ, తిమ్మంపేట, శనగకుంట, వాడగూడెం, అకినేపల్లిమల్లారం గ్రామాల్లో అదనపు ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటుకు డీఈ నాగేశ్వర్‌రావు బృందం శుక్రవారం ఎస్టిమేషన్లు వేసి, ఉన్నతాధికారుల అనుమతులు తీసుకున్నారు. త్వరలోనే ట్రాన్స్‌ఫార్మర్ల ఏర్పాటు పనులు మొదలు పెట్టనున్నట్లు డీఈ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ఏఈ కృష్ణారావు, సబ్ ఇంజినీర్ వెంకటేష్, ఆకరవి, లైన్ ఇన్‌స్పెక్టర్ మధు, అసిస్టెంట్ లైన్‌మెన్లు ఉదయ్, నరేశ్ పాల్గొన్నారు.

## విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన ఇసుక టిప్పర్

వెంకటాపురం(నూగూరు), మే 16 : మండల పరిధిలోని ఇప్పగూడెం సమీపంలో ఇసుక టిప్పర్ ఓ విద్యుత్ స్తంభాన్ని శుక్రవారం ఢీకొట్టింది. విద్యుత్ శాఖ ఏడీఏ ఆకిటి స్వామి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ సమీపంలో ఇసుక తరలిస్తున్న టిప్పర్ విద్యుత్ ప్రధాన పోల్‌ను ఢీకొట్టడంతో ఒక స్తంభం విరిగిపోగా, మరొకటి పూర్తిగా దెబ్బతిన్నది. గ్రామస్తుల సమాచారం మేరకు ఏఈ హనుమాన్‌చాస్, సిబ్బంది ఫరీద్ ఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. విద్యుత్ అంతరాయం కలుగకుండా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల లైన్ నుంచి విద్యుత్ పునరుద్ధరించినట్లు వారు వివరించారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED

★ త్రివేణి హోంకేర్, హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 18K. Ph: 9160900024 / 9640400073.
NT-336370-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

For Classified Ads
Please Contact...
9182777552
HANAMKONDA
9182777563
WARANAGAL
9182777556
JAYASHANKAR BHUPALPALLY
9182777135
MULUGU
9182777135
MAHABUBABAD
9182777557
JANGAON
9182777565

# భక్తులకు ఇబ్బందులు కలుగనివ్వొద్దు

**భూపాలపల్లి కలెక్టర్ రాహుల్‌శర్మ**



భక్తులతో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్ శర్మ

మహదేవపూర్ (కాళేశ్వరం), మే 16 : పుష్కరాలకు వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగనివ్వొద్దని కలెక్టర్ రాహుల్‌శర్మ అధికారులను ఆదేశించారు. శుక్రవారం ఆయన కాళేశ్వరంలో స్టాళ్లు, టెంట్ సిటీ, సరస్వతీ ఘాట్ వద్ద పుష్కర ఏర్పాట్లు, సౌకర్యా లు, మరుగుదొడ్లు, షవర్స్, చలివేంద్రాన్ని పరిశీలించారు. మంచినీరు అందుతున్నదా? మరుగుదొడ్లు, స్నానాల షవర్స్ ఎలా ఉన్నాయంటూ భక్తులను అడిగి తెలుసుకున్నారు. త్రివేణి సంగమం వద్ద చలి వేంద్రం ఏర్పాటు చేయాలని తక్షణమే వాకీటాకి ద్వారా ఆర్‌డబ్ల్యూఎస్ ఈఈని ఆదేశించారు. భక్తులు స్నానాలకు వెళ్లే మార్గంలో పిండ ప్రదానం కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, దాని వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని, మార్గంలో ఎలాంటి పిండ ప్రదానం కార్యక్రమాలు నిర్వహించొద్దని సూచించారు. జైళ్ల శాఖ ఆధ్వర్యంలో ఖైదీలు తయారు చేసిన హ్యాండ్ మేడ్ వస్తువుల స్టాల్‌ను ఆయన ప్రారంభించారు. అనతరం జిల్లా సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో సరస్వతీ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన సెల్ఫీ స్టాల్‌లో భక్తులతో ఫొటో దిగారు. అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, పరిశ్రమల శాఖ జీఎం సిద్దార్థ, డీఆర్డీవో నరేశ్, డీటీ కృష్ణ ఉన్నారు.

**స్టాళ్లను పరిశీలించిన మంత్రి శ్రీధర్‌బాబు**

వీఐపీ ఘాట్ వద్ద ఏర్పాటు చేసిన స్టాళ్లను మంత్రి శ్రీధర్‌బాబు పరిశీలించారు. స్టాళ్లు, తాగునీరు, ఆరోగ్య సదుపాయాలు, భద్రత ఏర్పాట్లను సమీక్షించారు. భక్తుల రద్దీ పెరుగుతుందని అధికారులు అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. కలెక్టర్ రాహుల్ శర్మ, ఎస్పీ కిరణ్ ఖరే, శాసన సభ్యులు మక్కన్ సింగ్, పరిశ్రమల శాఖ జీఎం సిద్దార్థ, డీఆర్డీవో నరేశ్ ఉన్నారు.

**అందుబాటులో ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలు**

భక్తులకు అందుబాటులో ఉచిత వైద్య శిబిరాలను ఏర్పాటు చేసినట్లు వరంగల్ ఆర్‌డీడీ డాక్టర్ ప్రమీలాదేవి తెలిపారు. కాళేశ్వరంలో ఏర్పాటు చేసిన వైద్య శిబిరాన్ని శుక్రవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. ఆయుష్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో యునాని, హోమియోపతి, ఆయుర్వేదిక్ సంబంధిత ఉచిత వైద్య ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నామన్నారు. ఆమెవెంట నోడల్ ఆఫీసర్ డాక్టర్ తనుజా రాణి, డీపీఎం డాక్టర్ లీచంద్ర , హనుమకొండ డీపీఎం డాక్టర్ భానుకుమార్ ఉన్నారు.

# దోమల నివారణకు బాధ్యతగా కృషి చేయాలి



ములుగు రూరల్ : ర్యాలీలో పాల్గొన్న డీఎంహెచ్‌వో

ములుగురూరల్, మే 16 : దోమల నివారణను సామాజిక బాధ్యతగా ప్రజలు భావించినప్పుడే డెంగీ వ్యాధిని అరికట్టవచ్చునని ములుగు డీఎంహెచ్‌వో డాక్టర్ గోపాల్‌రావు అన్నారు. డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ప్రభుత్వ దవాఖాన నుంచి డీఎంహెచ్‌వో కార్యాలయం వరకు శుక్రవారం వైద్య సిబ్బందితో నిర్వహించిన అవగాహన ర్యాలీలో ఆయన పాల్గొని మాట్లాడారు. వైద్యాధికారులు పీహెచ్‌సీ పరిధిలో ముందస్తు ప్రణాళికలు తయారు చేసుకొని సీజనల్ వ్యాధుల నివారణకు కృషి చేయాలన్నారు. దోమలు వ్యాప్తి చెందకుండా చేపట్టే చర్యలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ర్యాలీలో డెమో సంపత్, సిబ్బంది దుర్గారావు, సంపత్‌రావు, శకుంతల, వెంకట్‌రెడ్డి, భూపాలపల్లిరెడ్డి, నర్సింహారావు, సాంబయ్య, సురేష్‌బాబు, అరుణ, దేవేందర్ పాల్గొన్నారు.

**ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలి**

భూపాలపల్లి రూరల్ : ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని భూపాలపల్లి డీఎంహెచ్‌వో మధుసూదన్ తెలిపారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల్లో డెంగీపై అవగాహన పెంచేందుకు జిల్లా ఆరోగ్యశాఖ చర్యలు తీసుకోనున్నట్లు తెలిపారు. ఆకస్మికంగా తీవ్ర జ్వరం, తల నొప్పి, కంటి వెనుక భాగంలో నొప్పి, చర్మంపై ఎరుపు మచ్చలు, వాంతులు, వికారం వంటివి వస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. పరిసర ప్రాంతాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు.

**వాజేడు మండలంలో..**

వాజేడు : జాతీయ డెంగీ నివారణ దినోత్సవం సందర్భంగా మండలకేంద్రంలోని పీహెచ్‌సీ వద్ద వైద్యాధికారి అల్లి మధుకర్ ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది అవగాహన ర్యాలీ నిర్వహించారు. అలాగే, ప్రగళ్లపల్లి ఆయుష్మాన్ ఆరోగ్యమందిర్ పరిధిలో డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో భాగంగా నీటి నిల్వలను గుర్తించి శుభ్రం చేయడంతోపాటు మురుగు కాలువల్లో యాంటీ లార్వాను పిచికారీ చేశారు. కార్యక్రమంలో పల్లెదవాఖాన వైద్యాధికారి జ్ఞానస, హెల్త్ సూపర్‌వైజర్ కోటిరెడ్డి, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.



కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## అందాల పోటీపై ఉన్న శ్రద్ధ రైతుల కష్టంపై లేదా..?

**బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు కరుణాకర్‌రెడ్డి**

గణపురం, మే 16 : అందాల పోటీలపై ఉన్న శ్రద్ధ రైతుల కష్టంపై లేదా అని రాష్ట్ర ప్రభుత్వం, సీఎం రేవంత్‌రెడ్డిని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు మోతె కరుణాకర్‌రెడ్డి ప్రశ్నించారు. శుక్రవారం ఆయన మండలంలోని ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ రైతులు కష్టపడి పండించిన పంట కొనే దిక్కులేక, కొనుగోలు కేంద్రాల్లోనే తడిసి ముద్ద అవుతున్నాయన్నారు. ఓవైపు పంట తడిసి ముద్దవుతుందని రైతులు ఆవేదన చెందుతుంటే వందల కోట్లు ఖర్చు చేసి అందాల పోటీలు నిర్వహించడం సరైందా ? అని మండిపడ్డారు. అప్పులు తెచ్చి పంట పండిస్తే కొనే దిక్కులేదని విమర్శించారు. కేసీఆర్ ఉన్నప్పుడు ఎప్పుడూ వడ్ల కొనుగోలులో ఇంత జాప్యం కాలేదని గుర్తు చేశారు. ఈ ప్రభుత్వం రైతుల ఉసురు పోసుకుంటుందన్నారు. అనంతరం అధికారులతో ఫోన్లో మాట్లాడి తక్షణమే ధాన్యం కొనుగోలు పూర్తి చేయాలని కోరారు. మాజీ ఎంపీటీసీ మంద అశోక్‌రెడ్డి, సీతారాంపురం గ్రామ శాఖ అధ్యక్షుడు వైనాల వెంకటేష్, కుంట రణధీర్, పక్కల భద్రయ్య, గుండు సుభాష్, కోట ఐలయ్య, గుండు విష్ణు, ఈర్ల అంబేద్కర్ పాల్గొన్నారు.



ధాన్యాన్ని పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ప్రభుత్వ నిర్లక్ష్యంతో రైతులకు గోస

గోవిందరావుపేట, మే16 : కాంగ్రెస్ ప్రభుత్వ నిర్లక్ష్య దోరణితో రైతులు గోస పడుతున్నారని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు నరసింహానాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ పోరిక గోవింద్‌నాయక్ అన్నారు. శుక్రవారం చల్వాయి గ్రామంలోని కొనుగోలు కేంద్రాల్లో వర్షానికి తడిసిన రైతుల ధాన్యాన్ని కార్యకర్తలతో కలిసి వారు సందర్శించారు. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. కొనుగోలు ప్రక్రియల్లో అలసత్వం వల్ల రైతుల ధాన్యం తడిసిందన్నారు. రైతులకు అండగా బీఆర్ఎస్ పార్టీ ఉంటుందని చెప్పారు. కార్యక్రమంలో నాయకులు గట్టయ్య, శ్రీనివాస్, ఓదేలు, కనకయ్య, రమేశ్, రాజయ్య, రవి, సమ్మయ్య, కృష్ణమూర్తి, సతీశ్, రాజు, కుమార్, సోమిరెడ్డి, ఓదేలు, సాంబయ్య, దుర్గయ్య, విజయ, పాపయ్య పాల్గొన్నారు.

## గడ్డి మందు తాగి వివాహిత ఆత్మహత్య

కాటారం, మే 16: భర్తతో కాపురం చేయడం ఇష్టం లేక... ఇటు తల్లిదండ్రులకు భారం కాలేక.. మనస్తాపం చెంది పెళ్లయిన ఏడాదికే ఓ వివాహిత గడ్డి మందు తాగి ఆత్మహత్య చేసుకుంది. ఈ ఘటన కాటారం మండలం శంకరంపల్లి గ్రామంలో జరిగింది. ఎస్సై శ్రీనివాస్ కథనం ప్రకారం.. శంకరంపల్లి గ్రామానికి చెందిన గంట కత్తెరసాల కూతురు గంట రవళి (22) గురువారం తన పుట్టింట్లో తల్లిదండ్రులతో గొడవపడి మనస్తాపం చెంది ఆత్మహత్య చేసుకుంది. గత ఏడాది జనవరి 6న ములుగు జిల్లా వెంకటాపూర్‌కు చెందిన కన్నెవేన రాజుతో ఆమెకు వివాహం జరిగింది. ఆ తర్వాత హనుమకొండలోని అడ్వకేట్స్ కాలనీలో కాపురం పెట్టారు. కొంతకాలం సజావుగా సాగిన వీరి కాపురంలో మనస్పర్థలు మొదలై పంచాయితీ జరిగి రవళి ఇంట్లో ఎవరికి చెప్పకుండా వెళ్లిపోయింది. దీంతో ఆమె భర్తతోపాటు తండ్రి కూడా సుబేదారి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కరీంనగర్‌లో రవళి ఆచూకీ కనుక్కొని తిరిగి కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయినప్పటికీ భర్తతో కాపురం చేయడం ఇష్టం లేదని ఆమె పుట్టింటికి వచ్చింది. కొద్ది రోజులు గడిచాక తల్లిదండ్రులు నచ్చ చెప్పే ప్రయత్నం చేయగా భర్త వద్దకు వెళ్లనని ఖరాకండిగా చెప్పింది. దీంతో తల్లిదండ్రులు మందలించడంతో ఈ నెల 15న ఇంట్లో గడ్డి మందు తాగింది. కుటుంబ సభ్యులు భూపాలపల్లి ఆస్పత్రికి తరలించి మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ అదే రోజు సాయంత్రం మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. మృతురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

## విద్యుదాఘాతంతో యువకుడి మృతి



వంశీ(ఫైల్)

వాజేడు, మే 16 : విద్యుత్‌షాక్‌తో మండలంలోని జగన్నాథపురం గ్రామానికి చెందిన యువకుడు శుక్రవారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళితే.. గ్రామానికి చెందిన సోమిడి వంశీ(23) భద్రాచలంలోని ప్రైవేట్ దవాఖానలో కొంతకాలంగా కాంపౌండర్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం భద్రాచలంలోని ఒక లాడ్జీ సమీపంలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ తీగలు ప్రమాదవశాత్తు తగిలి మృతిచెందాడు. ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యాశాలకు తరలించినట్లు తెలిసింది.

## కమలాపురంలో పాడి గేదె..

మంగపేట : మండలంలోని కమలాపురం శివారులో శుక్రవారం కోరుకొప్పుల శంకర్‌కు చెందిన పాడి గేదె విద్యుతాఘాతంతో మృతి చెందింది. బాధితుడి కథనం ప్రకారం.. గ్రామ సమీపంలోని పంట పొలాల్లో ఉన్న త్రీఫేజ్ విద్యుత్ స్తంభంపై కాసారం పగిలిపోవడంతో విద్యుత్ తీగ ఐరన్ రాడ్‌కు తగిలింది. దాని నుంచి స్తంభంలోని ఐరన్ రాడ్‌లకు విద్యుత్ సరఫరా అయింది. ఇటీవల కురిసిన వర్షానికి స్తంభం మొదట్లో నీరు నిలువడంతో గేదె అందులోకి దిగడంతో విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతి చెందినంది. దాని విలువ రూ.60 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు అధికారులకు విజ్ఞప్తి చేశాడు.



పూజలు చేస్తున్న అర్చకులు

## ఘనంగా హేమాచలుడి నాగవెల్లి

మంగపేట, మే 16 : మల్లూరు హేమాచల లక్ష్మీనర్సింహస్వామి కల్యాణ బ్రహ్మోత్సవాల్లో భాగంగా శుక్రవారం అర్చక బృందం, భద్రాచలం వేదపండితులల ఆధ్వర్యంలో నాగవెల్లి, పెరుమాళ్లకు చక్రతీర్థం(చక్రస్నానం) నిర్వహించారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను యాగశాల నుంచి కల్యాణ మండపంలోకి తీసుకొచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేడుకల్లో ఈవో సత్యనారాయణ, భద్రాచలం సీతారామచంద్ర స్వామి ఆలయ అర్చకులు అమరవాది మురళీకృష్ణమాచార్యుల బృందం, స్థానిక అర్చకులు కైంకర్యం రాఘవాచార్యులు, ముక్కామల రాజశేఖర్ శర్మ, కారంపూడి పవన్‌కుమార్ ఆచార్యులు, సీతారాములు, ఈశ్వర్‌చందుశర్మ, మురళీశర్మ, వెంకటనారాయణశర్మ, సుధీర్ భక్తులు పాల్గొన్నారు.



అమ్మవారికి మొక్కులు సమర్పిస్తున్న భక్తులు

## ఘనంగా సడాలమ్మదేవి(సమ్మక్క) జాతర

వాజేడు, మే 16 : మండలంలోని గుమ్మడిదొడ్డి గ్రామంలో సడాలమ్మదేవి(సమ్మక్క) జాతరలో భాగంగా మూడో రోజు శుక్రవారం భక్తులు అమ్మవారికి భక్తి శ్రద్ధలతో మొక్కులు చెల్లించారు. కుటుంబ సమేతంగా తరలివచ్చి, మేకలు, కోళ్లు అమ్మవారికి సమర్పించి వంటలు చేసుకొని ఉల్లసంగా గడిపారు. ఈ సందర్భంగా భక్తులతో ఆలయ పరిసరాలు కోలాహలంగా మారాయి. భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సౌకర్యలు ఏర్పాటు చేశారు.

## కేటీకే-1ఇంక్లైన్ సమస్యలు పరిష్కరించాలి

కృష్ణకాలనీ, మే 16 : కేటీకే-1 ఇంక్లైన్‌లో అపరిష్కృత సమస్యలను వెంటనే పరిష్కరించాలని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) బ్రాంచ్ కార్యదర్శి మోటపలుకుల రమేశ్ డిమాండ్ చేశారు. ఫిట్ సెక్రటరీ సదయ్య ఆధ్వర్యంలో నిర్వహించిన గేట్ మీటింగ్‌కు ఆయన హాజరై కార్మిక సమస్యలు తెలుసుకొని మాట్లాడారు. కేటీకే-1లో కార్మికుల సమస్యలను పరిష్కరించాలని యాజమాన్యాన్ని కోరారు. ఈనెల 20న జరగాల్సిన సార్వత్రిక సమ్మె వాయిదా పడినట్లు ఆయన కార్మికులకు వివరించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీలు గంగసర్రపు శ్రీనివాస్, గురిజపెల్లి సుధాకర్‌రెడ్డి, అసిస్టెంట్ పిట్ అహ్మద్ ఖాన్, రిలే షిఫ్ట్ ఇన్‌చార్జిలు సాంబశివరావు, భూక్యా దేవ, శ్రీనివాస్, వసంత్, టెంపుల్ కమిటీ, సేఫ్టీ కమిటీ, మైన్స్ కమిటీ, బ్రాంచ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



కౌన్సెలింగ్‌లో విద్యార్థులకు ఎంపిక పత్రాలు అందజేస్తున్న ఆర్సీవో హరిసింగ్

## గురుకుల కళాశాలల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్

ఏటూరునాగారం, మే 16 : ములుగు, భూపాలపల్లి, మహబూబాబాద్ జిల్లాలోని గురుకుల బాలికల కళాశాలల్లో ప్రవేశం కోసం శుక్రవారం స్థానిక గిరిజన జూనియర్ కళాశాలలో కౌన్సెలింగ్ నిర్వహించారు. అర్హులైన విద్యార్థులకు అడ్మిషన్ పత్రాలు అందజేశారు. కాటారం, కేసముద్రం, కొత్తగూడ, వెంకటాపురం, మహబూబాబాద్, ఏటూరునాగారంలోని కళాశాలల్లో ప్రవేశానికి కౌన్సెలింగ్ నిర్వహించారు. మొత్తం 630 సీట్లు ఉండగా ఇందులో 319 భర్తీ అయ్యాయని ఇంకా 311 ఖాళీ ఉన్నట్లు ఆర్‌సీవో హరిసింగ్ తెలిపారు. స్థానిక ప్రిన్సిపాల్స్ విమల, కల్పన, సుజాత, కల్యాణి, కిరణ్మయి, పాల్గొన్నారు.

## భక్తుల సౌకర్యార్థమే మహాన్నదానం

కృష్ణకాలనీ, మే16 : సరస్వతీ పుష్కరాలకు వెళ్లే భక్తుల సౌకర్యార్థమే మహాన్నదాన కార్యక్రమం నిర్వహిస్తున్నామని సింగరేణి భూపాలపల్లి జీఎం రాజేశ్వర్‌రెడ్డి అన్నారు. భూపాలపల్లి మండలం కమలాపూర్ క్రాస్ వద్ద శుక్రవారం మహాన్నదానం కార్యక్రమం నిర్వహించగా జీఎం ప్రారంభించారు. భక్తులకు సింగరేణి కంపెనీ ఆధ్వర్యంలో ఉచిత అన్నదానం నిర్వహిస్తున్నామని, భక్తులు వినియోగించుకోవాలని కోరారు. ఏరియా పర్సనల్ మేనేజర్ కావూరి మారుతి, ఐఎన్టీయూసీ ఉపాధ్యక్షుడు బేతెల్లి మధుకర్‌రెడ్డి, శిరూప అనిల్ పాల్గొన్నారు.

# ఏటూరునాగారం, తాడ్వాయిలో భారీ వర్షం

ఏటూరునాగారం/ తాడ్వాయి, మే 16 : ఏటూరునాగారం, తాడ్వాయి మండలాల్లో శుక్రవారం తెల్లవారు జామున ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. నిత్యం కురుస్తున్న అకాల వర్షంతో రైతులు ఇబ్బంది పడుతూనే ఉన్నారు. ఆరబోసిన వడ్లు, కొనుగోలు కేంద్రాల్లో నిల్వ చేసిన ధాన్యం తడిసి ముద్దవుతున్నది. ఏటూరునాగారం మండలం గోగుపల్లిలో రోడ్డుపై రైతులు ధాన్యం ఆరబోసుకున్నారు. సీడ్ కంపెనీలతో ఒప్పందం కుదుర్చుకున్న వారు బ్బంది పడుతున్నారు. ఈ రైతులంతా కూడా ధాన్యంపై టార్పాలిన్ షీట్లు కప్పడం ఎండ రాగానే వాటిని తొలగించే పనిలో లీనమవుతున్నారు. పంట చేతికొచ్చే ముందు వడగండ్ల వానతో నష్టపోతే ఇప్పుడు తరచూ కురుస్తున్న అకాల వర్షాలతో నష్టం జరుగుతుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



ఏటూరునాగారం : గోగుపల్లిలో రోడ్డు పక్కనే ఆరబోసిన ధాన్యం



తాడ్వాయి : కాటాపురం కొనుగోలు కేంద్రంలో ధాన్యం రాశుల్లో నిలిచిన వర్షపు నీరు



మాట్లాడుతున్న కలెక్టర్ దివాకర

## లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి : ములుగు కలెక్టర్ దివాకర

ములుగురూరల్, మే16 : సంక్షేమ పథకాల లబ్ధిదారుల ఎంపికలో అధికారులు పారదర్శకత పాటించాలని కలెక్టర్ టీఎస్ దివాకర అన్నారు. శుక్రవారం ఆయన పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖల అధికారులతో కలెక్టరేట్‌లో జిల్లా స్థాయి సమావేశం నిర్వహించి మాట్లాడారు. అర్హులైన లబ్ధిదారులకు బ్యాంకుల ద్వారా కాన్సెంట్ తీసుకొని కార్పొరేషన్ల ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేయాలన్నారు. ఇందిరమ్మ ఇండ్ల విషయంలో అధికారులు క్షేత్ర స్థాయిలో పర్యటించి నిజమైన లబ్ధిదారులను ఎంపిక చేయాలని సూచించారు. జీపీ సిబ్బందికి ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించడంతో పాటు జూన్ 2న హెల్త్ క్యాంపు నిర్వహించాలని ఆదేశించారు. ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచుతూ పనుల్లో ఎక్కువ మందిని భాగస్వాములను చేయాలన్నారు. సమీక్షలో అదనపు కలెక్టర్ మట్టపెల్లి సంపత్‌రావు, డీపీవో ఒంటేరు దేవరాజు, ఎంపీడీవోలు, ఎంపీవోలు పాల్గొన్నారు.

**గురుకుల ప్రవేశాల పోస్టర్ల ఆవిష్కరణ**

మైనార్టీ గురుకుల ప్రవేశాల అవగాహన వాల్‌పోస్టర్లను కలెక్టర్ టీఎస్ దివాకర శుక్రవారం తన చాంబర్‌లో గురుకుల సిబ్బందితో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైనార్టీ గురుకులాల్లో నాణ్యమైన విద్య అందుతుందన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి రవీందర్‌రెడ్డి, ఆర్ఎల్‌సీ రమేశ్‌లాల్ హట్కర్, దేవగిరిపట్నం గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ శ్రీలత, వెంకటాపూర్ కళాశాల పిన్సిపాల్ వందన, సిబ్బంది పాల్గొన్నారు.

**శిక్షణ తరగతులను సందర్శించిన కలెక్టర్**

గోవిందరావుపేట : చల్వాయి మోడల్ పాఠశాలలో జరుగుతున్న ఉపాధ్యాయుల వృత్యంతర శిక్షణ తరగతులను కలెక్టర్ దివాకర శుక్రవారం సందర్శించారు. ఉపాధ్యాయులు నిత్య విద్యార్థిగా ఉంటూ నేర్చుకునే లక్ష్యణాలను పెంచుకొని విద్యార్థులకు మెరుగైన బోధనను అందించాలని అన్నారు. ఆయన వెంట ఓపెన్ స్కూల్స్ జేడీ సోమిరెడ్డి, డీఈవో పాణిని, సైన్స్ అధికారి జయదేవ్ ఉన్నారు.



మహాముత్తారం : కేక్ కట్ చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

## ఘనంగా పుట్ట మధు జన్మదిన వేడుకలు

మహాముత్తారం/ కన్నాయిగూడెం, మే 16 : బీఆర్ఎస్ మంథని నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే పుట్ట మధు జన్మదిన వేడుకలను శుక్రవారం మండల నాయకులు ఘనంగా జరుపుకున్నారు. కేక్ కట్ చేసి స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ సోమశాంత కుమార్, వైస్ చైర్మన్ వెల్మారెడ్డి అనిల్‌రెడ్డి, మాజీ జడ్పీటీసీ మందాల రాజిరెడ్డి, పార్టీ మండల మాజీ అధ్యక్షుడు మార్క రాము గౌడ్, మాజీ ఎంపీటీసీ శ్రీపతి సురేశ్, కాటారం మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ రాధారపు స్వామి, యామన్‌పల్లి మాజీ సర్పంచ్ రత్నం బక్కయ్య, ప్రశాంత్‌రెడ్డి, మహాముత్తారం డైరెక్టర్ లింగమల్ల రాజయ్య, వేమనపల్లి గ్రామ కమిటీ అధ్యక్షుడు అట్టెం రమేశ్, పంగ సంపత్, ముక్కెర నర్సయ్య, బండి గణేశ్ పాల్గొన్నారు. అలాగే కన్నాయిగూడెం పార్టీ మండల అధ్యక్షుడు సుబ్బుల సమ్మయ్య, పుట్ట మధు అభిమాని బొగ్గుల బతకయ్య ఆధ్వర్యంలో గూర్రేవులలో పార్టీ శ్రేణులతో కలిసి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో మఠం వెంకటేష్, శ్రీనివాస్, తడకల జగన్, రామారావు, సుమన్, మహేశ్, సదానందం, లచ్చన్న, సుధాకర్, కాంతారావు, శ్రీధర్, రామన్న, పుల్లయ్య, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

## కాళేశ్వరంలో భక్తుడికి అస్వస్థత

మహదేవపూర్, (కాళేశ్వరం) మే 16 : పుష్కరాలకు శుక్రవారం కాళేశ్వరం వచ్చిన ఓ భక్తుడు అస్వస్థ గురయ్యాడు. భూపాలపల్లి కార్మస్ కాలనీ చెందిన కిన్నెర రమేశ్ ఎండకు కండ్లు తిరిగి కింద పడిపోయాడు. గమనించిన స్థానికులు అతన్ని 108 వాహనంలో భూపాలపల్లి 100 పడకల ఆసుపత్రికి తరలించారు.



సమావేశంలో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

## మక్కజొన్న, వరి రైతులకు నష్టపరిహారం చెల్లించాలి

ఏటూరునాగారం, మే 16 : నకిలీ విత్తనాలతో జిల్లాలో మక్కజొన్న రైతులు నష్టపోయి నెలలు గడుస్తున్నప్పటికీ పరిహారం అందలేదని, విత్తన కంపెనీలతో పలు దఫాలుగా చర్చించినా ప్రయోజనం లేకుండా పోయిందని రైతు సంఘం రాష్ట్ర కమిటీ సభ్యుడు తుమ్మల వెంకటరెడ్డి ధ్వజమెత్తారు. మండల కేంద్రంలో శుక్రవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వెంకటరెడ్డి మాట్లాడుతూ జిల్లాలో సర్వే చేసి, పరిహారం కోసం నాలుగు రకాల వర్గీకరణ చేశారని, అయినప్పటికీ పరిహారం అందించలేదన్నారు. విత్తన కంపెనీలపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వెంటనే ఎకరాకు రూ.లక్ష చొప్పున పరిహారం అందించాలన్నారు. ఇద్దరు రైతులు ఆత్మహత్య చేసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలో మేల్, ఫిమేల్ వరి విత్తనాలను బేయర్, ఇండో అమెరికన్, కావేరీ, నూజివీడు విత్తన కంపెనీలు రైతులను మభ్య పెట్టి వందలాది ఎకరాల్లో సాగు చేయించాయని, నష్టపోతే ఎకరాకు రూ. 70 నుంచి 80 వేల వరకు ఇస్తామని ప్రకటించి, ఇప్పుడు ముఖం చాటేస్తున్నాయని ఆరోపించారు. రైతులను మోసం చేస్తున్న కంపెనీల లైసెన్సులను రద్దు చేయాలన్నారు. వడగండ్ల వానకు నష్టపోయిన రైతులకు పరిహారం ఇవ్వాలని కోరారు. సమావేశంలో నాయకులు గఫూర్ పాషా, యాకూబ్, కోటేశ్వర్‌రావు, సురేశ్, పాషా, చంద్రశేఖర్, రవి పాల్గొన్నారు.

## వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలి

మొగుళ్లపల్లి, మే 16 : గ్రామంలోని 15 ఏండ్లు పైబడిన వారందరూ ఉల్లాస్ కార్యక్రమం ద్వారా ప్రాథమిక విద్య, వృత్తి నైపుణ్యాలు పెంపొందించుకోవాలని ఎంఈవో లింగాల కుమారస్వామి అన్నారు. శుక్రవారం మండలంలోని మొట్లపల్లి పంచాయతీ ఆవరణలో తల్లిదండ్రుల- ఉపాధ్యాయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలో అన్ని సౌకర్యాలు కల్పిస్తూ విద్యార్థులకు మెరుగైన బోధన అందిస్తున్నామన్నారు. పదో తరగతి ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించామన్నారు. అనంతరం గ్రామంలో బడిబాట కార్యక్రమం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శి సుజాత, ఉపాధ్యాయ బృందం, అంగన్‌వాడీ సిబ్బంది, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.